# భక్తిరసామృతమును గ్రోలిన మానవునకు అన్యవాంఛలుండవు

సకలశాస్త్ర పురాణ సంగ్రహవేత్తయై
వేదాంతవేద్యుడౌ విబుధుడైన
రక్తి ఏపారగ రమ్య హర్మ్యంబుల
రమియించు రాజచంద్రముడునైన
రణరంగమందు పరాభూతరిపుడౌచు
వెల్గొందు జగదేక వీరుడైన
దారిద్ర్యదేవతా దాక్షిణ్యమున కుందు
దౌర్భాగ్యవిభుడగు దాసుడైన
భక్తిలేనిచో ఎందుకు పనికిరాడు
భక్తిలేనట్టి ఆ జగద్భర్తకన్న
భక్తిపరుడగు దాసుడే వంద్యుడగును.

దివ్యాత్మస్వరూపులారా!

'హృషీకేశ సేవనం భక్తిరుచ్యతే'. దైవసేవకే భక్తియని పేరు. ఆర్తహృదయుడై నిరంతరము భగవంతుని చింతచేయుచు స్మరించిన చిత్తము ద్రవిస్తుంది. ధారాపాతముగా భగవంతునిపైన ప్రసరించి భక్తిగా జనిస్తుంది. ఇట్టి మానసిక పరివర్తనయే 'భక్తి'యని పిలువబడుతుంది. భక్తిరసామృతమును గ్రోలిన మానవునకు అన్యవాంఛలుండవు. సుఖ దుఃఖములనుగాని, లాభనష్టములనుగాని, నిందాస్తుతులనుగాని లెక్కచేయక కృంగక, పొంగక స్థిరచిత్తుడై వుండే స్థితికే 'భక్తి'యని పేరు. మానవునియందు అనురాగము, ప్రేమ అనే సహజగుణములు సాంప్రదాయంగా వస్తున్నవి. ఇట్టి గుణములను భగవంతునిపైన

sri sathyasai vachanamrutam

మరల్చి నిరంతరము పవిత్రమైన కార్యములలో ప్రవేశింపజేసినప్పుడే యివి పునీతమవుతాయి. ఇట్టి మానవుడు మహనీయుడు మాత్రమేకాక, మహదేవుడుగాకూడా మారగలడు.

**విశ్వము విష్ణుస్వరూపము**

'సహస్రశీర్షాఃపురుషః సహస్రాక్ష సహస్రపాత్' అని శిరస్సులు అన్నీ, నేత్రములు అన్నీ, పాదములు అన్నీ భగవంతునివే! విశ్వం విష్ణుస్వరూపము. 'జగత్తంతయుకూడను భగవంతుని ఆకారమే!' అనే సత్యాన్ని దృష్టియందుంచుకొని జీవిస్తాడు. దీనినే ప్రేమాద్వైతమని, దివ్యమైన జీవబ్రహ్మతత్త్వ ఏకత్వాన్ని 'సోహం' భావముతో వూహిస్తుంటాడు, భక్తుడు. ఇట్టి భక్తుడు మోక్షమునుకూడను త్యజించి నిరంతరము దైవప్రేమనే ఆశించే తత్త్వమునకు 'అనన్యభక్తి' యని పిలుస్తూవచ్చారు. మానవుడు ఆచరించే పురుషార్థములైన ధర్మార్థకామమోక్షములతోబాటు ఐదవ పురుషార్థాన్నికూడా సాధించవలసిన కర్తవ్యమున్నదని నిరూపిస్తుంది, భక్తి. అదియే పరమభక్తి. దీనినే శంకరులవారు 'జ్ఞాన లక్షణం', అనికూడను ప్రబోధించారు. 'కర్మయోగాది శాస్త్రములందు నాకు పరిచయంలేదే', అని పరితపించనక్కరలేదు. పరమభక్తియందే సకల సుగుణములుకూడా యిమిడివున్నవి.

**అమృతత్వస్థితి దివ్యప్రేమతత్త్వముద్వారానే లభిస్తుంది**

మోక్షమనగా దైవత్వమునందు లీనము కావటమని భావిస్తూవుంటాయి పురాణములు. కాని, యిట్టి ఏకత్వమునందు ఎట్టి ఆనందముకూడను లభించదనియు, సజీవమైన మానవత్వమందు నిరంతరము భగవచ్చింతన చేతను, భగవత్ సంయోగముచేతను కాలము గడుపుటయే మోక్షమని విశ్వసించటమే భక్తిలక్షణము. భగవంతునిపైగల ప్రేమతత్త్వమే మోక్షమని నిరూపిస్తూ వచ్చింది, వేదాంతము. భగవంతుని హృదయము మధురాతి మధురమైన తత్త్వము. ఏనాటికైనా, ఎప్పటికైనా ప్రతిమానవుడు ఆ ప్రేమ మందిరములో ప్రవేశించక తప్పదు. ఇట్టి పరమభక్తుడు మోక్షమును త్యజిస్తాడు. ఆవిధంగా త్యజించిన మానవుని పరమభక్తియే భగవంతుని ఒడిలో చేరుస్తుంది.

sri sathyasai vachanamrutam

మోక్షమనగా అమృతతత్వస్థితిని అందించటమని శాస్త్రములయొక్క ప్రమాణము. నీటి బిందువును నీరధిలో చేర్చినప్పుడు అది అమృతత్వముగా మారుతుంది. అదియే అనంతంగా రూపొందుతుంది. అమృతత్వము, అమరత్వము, అనంతత్వము యీ మూడింటి ఐక్యముచేతనే ఏర్పడుతుంది. అదే నీటిబిందువు కొన్ని క్షణములు మన చేతియందుంచుకొనిన ఆవిరిగామారి మృత్యువును పొందుతుంది. అట్టి నీటిబిందువును సముద్రములో చేర్చినప్పుడు అనంతమైన ఆకారాన్ని చేరుతుంది. అమరత్వముగా రూపొందుతుంది. అదే అమృతంగా పరిణమిస్తుంది. ఇట్టి అమృతత్వమైన ఐక్యత ప్రేమతత్త్వముద్వారానే మనకు లభ్యమౌతుంది. అమృతస్వరూపాన్ని పొందిన భక్తుని ఆకారతత్వమంతా కూడను అచ్యుతాకారముగా రూపొందుతుంది. ఈ విధమైన అమృతత్వాన్ని అనుభవించి, ఆనందాన్ని గ్రోలి జీవితములో దివ్యత్వాన్ని అనుభవించినవారే గోపికలు.

చేప జలమును వదలి క్షణమైనా నిలువలేదు. ఆ జలమును వదలెనా, తన ప్రాణము నిలవదు. అదేవిధముగనే భక్తిరసామృతమను సముద్రమునందున్నంతవరకే భక్తునియొక్క జీవితము సుఖశాంతుల ననుభవిస్తుంది. భక్తిరసామృతమునకు దూరమాయెనా తన జీవితమే శూన్యమైపోతుంది. నిజముగా యిట్టి ప్రేమతత్త్వాన్ని అనుభవించిన మానవత్వము అన్య జీవితాన్ని ఆశించదు. భాగవతమునందుకూడను ఇదే విషయము చక్కగా వర్ణింపబడింది. 'మందారమకరందమాధుర్యమును గ్రోలు మధుపంబు వోవునే మదనములకు' అనగా మందార పుష్ప మకరందమును గ్రోలిన తుమ్మెద ఉమ్మెత్త పూవువైపునకు ఉరుకు లెత్తుతుందా! ఆకాశగంగలో ఆటలాడు హంస కేవలము మురికినీటిలో మునుగుతుందా? మామిడి చివుళ్లు తిని మధురగానంచేసే కోకిల అడవి మల్లెలవైపున అడ్డులు చాస్తుందా? తొలివానజల్లులో మెల్లమెల్లగా తిరిగే చకోరపక్షి మంచుగడ్డలవైపు పరుగులెత్తుతుందా? ముద్ద ఖర్జూరముతిన్న మానవునకు చింతపండు రుచిస్తుందా? అదే విధముగానే మందారమకరంద మాధుర్యమును గ్రోలిన మానవత్వము అన్యవ్యక్తులనుగాని, అన్యవిషయములనుగాని, అన్యపదార్థములనుగాని యేనాటికి ఆశించదు, అభిలషించదు. సర్వాంగములయందును భక్తిరసామృతమును నింపుకున్న



srisathyasaivachanamrutam

భక్తుని ఏ అంగమునందైనను దివ్యమైన మంగళతత్త్వమే రూపొందింపజేస్తుంది. అట్టి భక్తుడు భగవంతుని వాణి విన్నంత మాత్రమున మైమరచి పులకించిపోతాడు. ఇట్టి ప్రేమతత్త్వము వారియందుండటముచేతనే భగవంతుడుకూడా వారిని అనేకవిధములుగా సంరక్షిస్తుంటాడు.

**పరమ ప్రేమతత్త్వము కేవలము అనుభూతికేగాని, విచారణకు ఏమాత్రము అందదు**

ఒకప్పుడు కృష్ణుడు ఉద్ధవునికి యీ భక్తిరసామృతమును గురించి తెల్పుతూ వచ్చాడు: "ఉద్ధవా! గోపికలు కేవలము పిచ్చివారని భావిస్తున్నావు. వట్టి అమాయకులు. వారు పరిపూర్ణమైన భక్తి మాలికలు. నా హృదయానికి ఏలికలు. నిర్మల, నిశ్చల, దీప్తులు. అట్టి పవిత్ర భక్తిగల గోపికలతత్వము వర్ణనాతీతంగా వుంటుండాది. నానుండి ఎట్టి ఫలితమునుకూడా ఆశించనివారు. నా దివ్యత్వాన్ని మాత్రమే ఆశించి, నా దివ్యత్వాన్ని మాత్రమే వరించి, నా దివ్య ప్రేమవాహినిలో కరిగి మైమరచిపోయేవారు. అట్టిగోపికల భక్తితత్త్వాన్ని అన్యులు అర్థం చేసుకొనుటకు సాధ్యంకాదు".

మరొక సమయమునందు గోపికలు కృష్ణుని మధుర మోహన వేణుగానమును విన్నంతమాత్రమున తమ గృహములు వీడి వనమునకు పరుగెత్తారు. వనమధ్యములో చేరి కృష్ణునియొక్క వియోగమును భరించలేక అనేకవిధములుగా పరితపించి పొదపొదను, మొక్కమొక్కను, పుష్పములను, చెట్టుచెట్టునుకూడా ప్రశ్నిస్తూవెళ్లారు. నిజముగా జడ, చైతన్యములనేవి వారి దృష్టియందు ఏకత్వంగా భావిస్తూవచ్చారు. కాకుండిన పుష్పములు, చెట్లు, పొదలు కృష్ణునియొక్క రాకను వీరికి తెలియజేయగలవా? ఆ వివేక, విజ్ఞానములు వారియందు శూన్యములు. కేవలము కృష్ణునియొక్క ప్రేమామృతమును మాత్రమే దృష్టియందుంచుకొని వృక్షములను, పుష్పములను, మొక్కలను అడుగుతూ వచ్చారు, 'మా కృష్ణుడు ఎక్కడ?' అని. కృష్ణుడంటే ఎవరో యీ మొక్కలకు తెలియజెప్పాలని కృష్ణునియొక్క గుర్తులన్నీ చెప్పుతూ వస్తున్నారు, గోపికలు.

**నల్లనివాడు పద్మనయనమ్ములవాడు కృపారసంబుపై**
**జల్లెడివాడు మౌళి పరిసర్పితపింఛమువాడు నవ్వురా**



srisathyasaivachanamrutam

**జిల్లెడి మోమువాడు ఒకడు మాసర్వము దోచుకువచ్చె ఓ**
**మల్లియలార మీపొదలమాటున లేడుగదమ్మ చెప్పరే!**

అనగా ప్రతీవిషయమునందును మానవుడు విమర్శించుట, విచారణ చేయటము సంభవిస్తూంటుంది. విచారణశక్తి భక్తిని శూన్యము గావిస్తుంది. దీనిని యీ కాలపు ప్రజలంతా కూడను గుడ్డి నమ్మకమని అంటారు. ఈనాటి మానవునియొక్క విచారణశక్తి వక్రమార్గము ననుసరిస్తూ వుంటుంది. సత్యమును అర్థము చేసుకోలేడు. సులభసత్యాన్ని లక్ష్యము చేయడు. ఇలాంటి మేథావి సత్యాన్ని యేరీతిగా గుర్తించగలడు? ఈ భక్తిరసము గ్రోలిన మానవుని తత్త్వము కేవలము అమాయకముగానే వుంటుంది. శాస్త్ర విజ్ఞానమును మాత్రమే పరిశీలనము చేయగలడుగానీ పరతత్త్వాన్ని పరిశీలన చేసే అధికారము మానవునికి యేమాత్రములేదు. పరతత్త్వానికి రూపములేదు. పరమ ప్రేమతత్త్వము కేవలము అనుభూతిని మాత్రమే అందించునుగాని, విచారణా ప్రమాణమునకు యేమాత్రము అందదు. కనుక, ఇందులో హేతువాదమనేది యేమాత్రము అవకాశముండదు.

**జాగ్రత్స్వప్నసుషుప్తులయందు భగవద్వాణిని శ్రవణము చేసిన భక్తులకు అన్య విషయములు ఏమాత్రము చెవులలో చేరవు**

ఒకానొక సమయములో ఒక గోపిక రాధను ప్రశ్నిస్తుంది: "తల్లీ! కృష్ణుని చూచినప్పుడు నీ హృదయము యేరీతిగా పరిణమిస్తుందో, యేరీతిగా స్పందిస్తుందో, ఏరీతిగా మార్పుచెందుతుందో, ఏవిధమైన ఆనందమును అనుభవింపచేస్తుందో ఒక్కతూరి నాకు చెప్పి ఆనందింప జేయుము". "నేనేమని చెప్పగలను! కృష్ణుని నామామృతమును ఒక్కతూరి విన్నంత మాత్రముననే నా హృదయము స్తంభించిపోవుచున్నది. అతని ఆగమన విషయము విన్నంత మాత్రముననే నా దేహముకూడను మరచిపోవుచున్నాను. అతని మధురగానమును విన్నంతమాత్రముననే నేను పిచ్చిదాననై పోవుచున్నాను. ఈ మత్తులో, యీ ఉన్మత్తములో నేను కృష్ణునియొక్క అనుభూతిని యేరీతిగా చెప్పగలను? నాకు సాధ్యముకాదు" అనింది, రాధ: అనగా ప్రేమతత్త్వముయొక్క అనుభూతి యిట్టిది, అట్టిది అని చెప్పుటకు

srisathyasaivachanamrutam

సాధ్యముకాదు. చెప్పకలిగినవారు దానిని అనుభవించలేదనే అర్థము. ఉద్ధవుడు వచ్చి గోపికలకు యోగశాస్త్రమును చెప్పటానికై పూనుకున్నాడు. అప్పుడు గోపికలు "ఓ ఉద్ధవా! ఆ కృష్ణునియొక్క మురళినాదమనే శబ్దము మా కర్ణములలో నిండివుంటున్నది. ఇంకొక పలుకులు చేర్చుకొనుటకు మాకు సాధ్యముకాదు. కృష్ణుని మోహన విగ్రహమనేది మానేత్రములలో కళకళలాడుతూ జ్యోతులవలే ప్రకాశిస్తూ వుంటున్నది. ఇతర రూపములు చూచుటకు మా కన్నులు అంగీకరించవు. ఇతర విషయములు మా హృదయములో చేరుటకు సాధ్యముకాదు. వచ్చినదారిని వెళ్లమ"న్నారు. అనగా పవిత్రమైన దివ్యత్వాన్ని నింపుకున్న హృదయములో అన్యవిషయములు యేమాత్రము ప్రవేశించుటకు వీలుకాదు. ఒక స్వరూపముపైన దృష్టినిలిపిన వ్యక్తులకు మరొక విషయము యేమాత్రము కనుపించదు. జాగ్రత్, స్వప్న. సుషుప్తులయందుకూడను దివ్యమైన భగవద్వాణిని శ్రవణము చేసిన భక్తులకు అన్యశబ్దములు యేమాత్రముకూడను చెవులలో చేరవు. గోపికలయొక్క హృదయము నిరంతరము కృష్ణమయమై వుంటూ వుండేటువంటిది.

**కన్నులందెప్పుడు కారుణ్యదృష్టియే**
**పల్కులెప్పుడు ప్రీతి నొలుకుచుండు**
**నగుమోముయందు అమృత భావమే**
**హృదయమందెప్పుడు ముదము గూర్చు**

ఇది నిజమైన భక్తపరునియొక్క స్వభావము. ఈనాడు భక్తి, భక్తి, భక్తి అంటున్నాము మనము. భక్తి అనే పదముయొక్క వ్యుత్పత్తిగాని, భక్తి లక్ష్యముగాని, లక్షణముగాని, భక్తికి ఒక స్వరూపముగాని మనము చూపలేకపోతున్నాము. ఇటువంటి పరిపూర్ణ స్వరూపమైన పరమ భక్తితో పోల్చిచూస్తే యీనాడు మనము ఆచరించే భక్తి యెంత అల్పత్వముగా ఉన్నదో మీరే యోచించుకోవచ్చు. కనుక, భక్తి అనగా మనము ఒక లక్ష్యాన్ని వుంచుకొని ఆ లక్ష్యమనే గమ్యమును చేరేంతవరకు మనపట్టును వదలరాదు. దీక్షను మానరాదు. అదియే మనము ఒక జీవితవ్రతముగా భావించుకోవాలి.

**సత్సంకల్పములు పోషించుకొనవలెనన్న దుస్సంగమును త్యజించాలి**

ఏదో కొన్ని క్షణములు మాత్రమే దైవచింతన గావించి మిగిలిన కాలమునంతయు వ్యర్థమైన లౌకిక జీవితమునందు గడపటము భక్తునియొక్క కర్తవ్యము కానేరదనే సత్యాన్ని భాగవతము బోధిస్తూవచ్చింది. దీనికి సత్సంగము అత్యవసరము. సత్సంగములోనే యిట్టి సంకల్పములు అందుకోవటానికి సాధ్యమవుతుంది. సత్సంకల్పములు పోషించుకొనవలెనన్న దుస్సంగమును త్యజించాలి. దుస్సంగముచేత మానవుడు దుర్మార్గుడుగా మారిపోతాడు. దుష్టభావములు తలలో చేరుతాయి. దుష్ప్రవర్తనలో ప్రవేశిస్తాడు. దుష్టభావములనే ఆశిస్తుంటాడు. పరనిందలలో ప్రవేశిస్తుంటాడు. రాగద్వేషాలలో మునిగివుంటాడు. తమోగుణము తన శిరస్సుపైన తాండవమాడుతూవుంటుంది. ఇట్టి దుస్సంగస్వభావముకల్గిన మానవునికి యేరీతిగా సత్సంగప్రభావము శిరస్సునందు చేరుతుంది? ఎటువంటి సజ్జనుడైనా, ఎంత ధర్మపరుడైనా దుస్సంగము చేరినప్పుడు తన ధర్మము, తన సత్యమార్గము సర్వముకూడను కోల్పోతాడు.

**చలించని మనస్సు, భ్రమించని దృష్టి అభివృద్ధిపరచుకొనటమే భక్తి లక్షణము**

పాండవులలో అగ్రజుడు ధర్మమూర్తి. అతని చర్యలు అతని పలుకులు సర్వము కూడను ధర్మముతోనే కూడినవి. దుష్టులైన దుర్యోధన, దుశ్శాసన, కర్ణ, శకుని యీ నలుగురి స్నేహము చేయటంచేత ధర్మజుడుకూడను సర్వము కోల్పోయి కట్టకడపటికి అరణ్యవాసము చేయవలసివచ్చింది. ఈ దుస్సంగముచేత పవిత్రహృదయుడైన ధర్మజుడుకూడను సర్వస్వమును కోల్పోవలసివచ్చింది.

ప్రేమమూర్తి కైక. రాములన్న ప్రాణసమానము. అట్టి కైక దుష్టురాలైన మంథరతో చేరటంచేతనే కుమారుని దూరము చేసుకుంది. ఇతరులు తనను దూషించగలిగారు. చీకటిమందిరములో ప్రవేశించింది. హృదయాన్ని విప్పి ప్రార్థించింది.

**పతిసుతులకుదూరమైన పడతి బ్రతుకదేల**
**ఏపాపఫలంబోగాని యీ తాపము నాకుకలుగజేసె ॥పతి॥**

ఈవిధంగా పట్టపురాణియైన కైకకూడను దుస్సంగప్రభావముచేత తనయొక్క సత్కీర్తిని

కోల్పోయి, సద్గుణములనుకూడా కోల్పోయి లోకనిందలపాలైంది.

రాముడు విభీషణునితో "దుస్సంగముయొక్క వాసముకంటే నరకవాసము చాలా శ్రేష్ఠము", అన్నాడు. దుష్టులతో సహవాసము యేమాత్రము మనము చేయరాదు. కృష్ణునియొక్క మిత్రుడైన ఉద్ధవుని బోధలు వినటానికి గోపికలకు మనస్కరించలేదు. మంచిచెడ్డలు వారు యేమాత్రము విచారించదలచలేదు. కృష్ణునితో సహవాసము అనే ఒక్క లక్ష్యమునుమాత్రమే వారు దృష్టియందుంచుకున్నారు. కాని, యీనాటి భక్తులయొక్క లక్ష్యము క్షణక్షణమునకు మారుతూవుంటుంది. ఈ దినము ఒక భావము, రేపటి దినము మరొక భావము. ఇలాంటి మార్పులు, కూర్పులు యేమాత్రము కూడను భక్తికి లక్షణముకాదు. చలించని మనస్సును, భ్రమించని దృష్టిని అభివృద్ధిపరచుకొనటమే భక్తి లక్షణము. కష్టములకు కృంగటముగాని, శుభములకు పొంగటముగాని వుండరాదు. భక్తి అనగా యేమిటో మొట్టమొదట గుర్తించుకోటానికి ప్రయత్నించాలి. తన హృదయము చలించకుండా వుండటానికి తగిన కృషి చెయ్యాలి. నిరంతరము నీవు ఆశించిన రూపాన్ని చింతించుకోటం, దానిని స్మరించటము, యీ రెండింటిద్వారానే హృదయము ద్రవించిపోతుంది. ఇదే ప్రేమతత్త్వము. ఈ ప్రేమకే పరమభక్తి యని పేరు. ఇట్టి పరమభక్తియే పరతత్త్వానికి సరైన గమ్యము.

**ఈ జగత్తంతయు ప్రేమస్వరూపము**

పరమభక్తులు మోక్షమునుకూడను త్యజిస్తారు. కులశేఖరాళ్వారు "స్వామీ! తరించటానికి, జన్మ సార్థకము కావటానికి మోక్షము, మోక్షము అంటారు. నాకా మోక్షము యివ్వనక్కరలేదు. దయచేసి నిరంతరము జన్మజన్మలకు నీ పదసేవయందు, నీయొక్క ప్రేమామృతమునందు మునిగితేలే జన్మలు వేయి జన్మలైనా నాకు అనుగ్రహించు. మోక్షము నాకక్కరలేద"న్నాడు. "నేను చక్కెరగా రూపొందిన నీ మాధుర్యముయొక్క రుచిని నేను అనుభవించలేను. నీవు చక్కెరగావుండి నేను చీమగా వుండి నీ మాధుర్యము నేను అనుభవించే ఆనందాన్ని నాకు అనుగ్రహించు" అన్నాడు. ఇదే పరమభక్తియొక్క లక్షణము. 'బ్రహ్మవిత్‌బ్రహ్మైవ భవతి' అని, నిరంతరము బ్రహ్మతత్త్వమును చింతించుకుంటూ బ్రహ్మగా

srisathyasaivachanamrutam

రూపొందటము యిది అంతగా ఆనందకరమైన మార్గముకాదు. అందువలననే విశిష్టాద్వైతమనే మార్గమునందు యనేకవిధములుగా శ్రీరామానుజులు ఆ పరమ తత్త్వాన్ని గుర్తింపజేసి దివ్యమైన ప్రేమతత్త్వములో మునుగుతూ ఆనందాన్ని అనుభవిస్తూవచ్చాడు. కొందరు కర్మమార్గము ప్రధానమనియు, మరికొందరు జ్ఞానమార్గము ఉత్తమమనియు, ఇంకా కొందరు భక్తిమార్గము విశిష్టమనియు ఇలా ఎవరికి తోచినట్లు వారు ప్రచారము సలుపుతూవచ్చారు. అయితే, అన్నింటియందు ప్రేమమార్గమనే భక్తియే ప్రధానమైనదని సర్వులూ విశ్వసిస్తూవచ్చారు.

ఈ ప్రేమయే దైవము. ఈ ప్రేమయే జీవుడు. ప్రాణులన్నియును పరమాత్మునియొక్క ప్రతిబింబములే. సర్వంబ్రహ్మమయంజగత్. ఏ పదార్థమును చూచినా, ఏ విషయాన్ని చింతించినా, ఏ విషయమును చింతించినా, ఏమి చేసినా అంతా కూడను ప్రేమమయముగానే వుంటుండాలి. ఈ జగత్తంతయు ప్రేమమయ స్వరూపము. విశ్వంవిష్ణుస్వరూపము. తాను కాని స్థానము, తనది కాని పేరు జగత్తునందు కానరాదు. కనుక, సర్వము భగవత్ స్వరూపమనే భావించి దానిని అనుభవించటమే నిజమైన పరతత్త్వముయొక్క మూలతత్త్వము. ఇట్టి మార్గమునే అవలంబించాడు నారదమహర్షి, 'త్యాగోభవతి, తృప్తోభవతి, ఆత్మారామోభవతి' అన్నాడు. అనగా "అయ్యా! నీ మధుర రసమును గ్రోలిన, నీ ప్రేమరసాన్ని అనుభవించే ప్రతి భక్తుడు తృప్తుడుగా వుంటుంటాడు. అమృత స్వరూపుడుగా వుంటుంటాడు. ఆనందమయుడుగా వుంటుంటాడు. తపస్సులో లీనమై వుంటుంటాడు. అట్టి దానిని నాకు అనుగ్రహించ"మన్నాడు.

**భగవంతుని ప్రేమరసములో మానవుని అజ్ఞానము కరగిపోతుంది**

లోకములో వృక్షములు, పక్షులు, పశువులు జగతికి స్వార్థరహితమైన సేవలు చేయుచున్నవి. కాని, మానవుడు తనజాతికి, తన తల్లితండ్రులకు, తన గురువునకు, కడపటికి దైవానికికూడను ద్రోహము చేస్తూవస్తున్నాడు. సత్యము, ధర్మము, ప్రేమ, అహింసలను ప్రదర్శించుచున్నాడుకాని, దర్శించటంలేదు. ఆచరించుటలేదు. "ఎన్ని కల్గినా కూటికే, ఎంతకాలము బ్రతికినా కాటికే", అనే సత్యాన్ని గుర్తించుకోలేకపోతున్నాడు.

sri sathyasaivachanamrutam

సర్వులూ తనను గౌరవించాలనే ఆశిస్తున్నాడుగాని పరులను గౌరవించటానికి తను యేమాత్రము ప్రయత్నించుట లేదు. దీనికి కారణమేమిటి? స్వార్థము, అజ్ఞానము, అహంకారము. ఈ స్వార్థం యేనాడు పోవునో ఆనాడే పరార్థములో ప్రవేశిస్తాడు, మానవుడు. సూర్యకిరణములద్వారా మంచు మాయమవునట్లుగా, భగవంతునియొక్క ప్రేమరసముద్వారా మానవునియొక్క అజ్ఞానము కరగిపోతుంది. ఈ ప్రేమ యెక్కడనో లేదు. ప్రేమ ప్రతి మానవునియొక్క హృదయమునందు వుంటున్నది. దానిని పెంచుకోవాలి. గృహములో వున్నవారితో ప్రేమను పెంచుకోవాలి. తదుపరి గ్రామములో యీ ప్రేమను అభివృద్ధి గావించాలి. గ్రామముద్వారా రాష్ట్రములో ప్రేమను అభివృద్ధి పరచాలి. రాష్ట్రముద్వారా దేశములో ప్రేమను వ్యాప్తిగావించాలి. చివరకు, విశ్వాన్నే ప్రేమమయముగా మార్చాలి. ప్రేమ అనేది వ్యక్తియందు బీజముగా వుండి విశ్వమునందు వ్యాప్తిచెందుతున్నది. కనుక, విశ్వప్రేమను మనము అనుభవించవలెనన్న వ్యక్తిప్రేమను మనము అభివృద్ధిగావించుకోవాలి. ఈ ప్రేమనే మనము భగవంతునిగా విశ్వసించాలి.

**ప్రేమతత్త్వమును విశ్వసించని మానవుడు లేడు**

లోకములో అనేక రూపములను మనము ఆశిస్తున్నాము. ఆ రూపములన్నీ మన ఊహాగానములేగాని, ప్రేమ అనేది ప్రత్యక్ష స్వరూపము. ఆస్తికుడైనా, నాస్తికుడైనా, యాస్తికనాస్తికుడైనా, యోగియైనా, భోగియైనా, విరాగియైనా ప్రేమతత్త్వాన్ని విశ్వసించని మానవుడు లేడు. అందరూ అంగీకరించిన భగవత్స్వరూపము ప్రేమమూర్తి ఒక్కటి మాత్రమే. కనుక, యిట్టి ప్రేమను అభివృద్ధి పరచుకొని ప్రేమద్వారానే ప్రేమమయుని చేరటానికి ప్రయత్నించటమే ప్రేమమార్గము. ఇదే భక్తిమార్గము. ఇట్టి మార్గమునకు ఆదర్శమూర్తులే గోపికలు. భక్తి సామ్రాజ్యమునకు చక్రవర్తి, నారదుడు. అన్ని లోకములయందు ప్రవేశించి యీ భక్తిని చాటుతూ ఆనందముగా అనుభవింపజేస్తూ తాను అనుభవిస్తూ వచ్చాడు, నారదుడు. ఇట్టి ప్రేమ ప్రభావముచేతనే ప్రహ్లాదుడుకూడను తాను ఆహ్లాదాన్ని అందుకుంటూ వచ్చాడు. నిరంతరము నారాయణుని చింతన చేయటంచేతనే అతని పేరు ప్రహ్లాదుడని సార్థకమైంది. ప్ర-ఆహ్లాద అనగా ఆహ్లాదమును పరిపూర్ణమైన

srisathyasaivahini

స్వరూపములో అనుభవించినవాడు ప్రహ్లాదుడని అర్థము.

**అన్యచింతలు లేని భక్తియే అనన్యభక్తి**

ప్రహ్లాదుడు చెప్పాడు: "ఇందుకలడందులేడని సందేహము వలదు, ఎక్కడ చూచినా దైవము వుంటున్నాడ"ని. తండ్రితో వాదిస్తూవచ్చాడు. కడకు హిరణ్యకశిపుడు "యీ స్తంభములో దేవుడు వుంటున్నాడా?" అని వాదించాడు. తప్పక వున్నాడని తాను విశ్వాసముతో గట్టిగా నుడివాడు. ఆ స్తంభమును బ్రద్దలుచేశాడు, హిరణ్యకశిపుడు. అందులోనే భగవంతుడు ఉద్భవించాడు. దీనియొక్క అంతరార్థము ఏమిటి? దైవము మన దేహమునందే వుంటున్నాడు. దేహమే ఒక స్తంభము. ఈ దేహభ్రాంతులు యేనాడు బ్రద్దలు చేస్తామో అప్పుడే భగవంతుడు ఉద్భవిస్తాడు. కనుక, దేహాభిమానము బ్రద్దలుచెయ్యాలి. నిరంతరము దేహాభిమానము, దేహభ్రాంతితోనే తాను జీవిస్తూవుంటే దైవత్వము యే రీతిగా మనకు సాక్షాత్కరిస్తాడు. కనుకనే "దేహోదేవాలయప్రోక్తో జీవోదేవస్సనాతనః" అని దేవుడనేవాడు దేహమునందే సనాతనుడుగా వుంటుండి నూతనముగా ప్రకటిస్తూ వుండినాడని బోధిస్తూవచ్చింది, వేదాంతము. ఈ జగత్ సృష్టికంతయుకూడను భగవంతుడే బీజము. ఈ విశ్వమే వృక్షము. మానవులే యిందులోని ఫలములు. ప్రతి మానవునియందు ఆత్మస్వరూముగా వుండినది దైవత్వమనే విత్తనము. ఆ ఆత్మయొక్క క్రియనే యీ జగత్తుయొక్క సృష్టి. ఏతావాతా బీజమునుండి ఉద్భవించిన దైవత్వము బీజరూపములోనే భగవత్ తత్వాన్ని ప్రకటిస్తూ వస్తున్నాడు. కనుక, జననమరణములన్నియు కూడను దైవస్వరూపాలే. ఇట్టి గాఢమైన విశ్వాసము మన హృదయములో నిలచిపోవాలి. ఇట్టి విశ్వాసమే దృఢము కాకుండిన మన భక్తికి ప్రయోజనము వుండదు. ఇది భక్తియని అనిపించుకోదు. ఎట్టి దానికైనా మనము సిద్ధముగా వుంటుండాలి. ఎదుర్కోవాలి. కష్టములు, నష్టములు, విచారములు, దుఃఖములు, నిందలు, నిష్ఠూరములు ఎన్ని వచ్చినా దైవమునందు విశ్వాసమును కోల్పోరాదు. విశ్వాసమును అభివృద్ధి గావించుకున్నప్పుడే మన భక్తి కూడను ప్రపత్తిగా మారి, తద్వారా మధురభక్తిగా రూపొంది దైవత్వములో లీనమైపోతుంది. ఈ అనన్యభక్తిని మనము అభివృద్ధి పరచుకోవాలి. అన్యచింతలు లేని

sri sathyasaivachanamrutam

భక్తియే అనన్యభక్తి. "నీవే తప్ప నితఃపరంబెరుగ". తనను తప్ప అన్యమును మనము యేమాత్రము ఆశించరాదు. ఇట్టి భక్తి త్రికాలములయందు. త్రిలోకములయందు, త్రిగుణములయందు వ్యాప్తిగావించాలి.

**"సాధనమున పనులు సమకూరు ధరలోన"**

ఈనాటి మనభక్తి తెల్లవారి పూజరూమ్‌లోకి పోయినప్పుడు భక్తిగా వుంటుంటాది. మధ్యాహ్నమైతే భోగముగా తయారౌతుంది. రాత్రికి రోగముగా మారుతుంది. "సతతం యోగినః", అంది భగవద్గీత. నిరంతరము కూడను, త్రికాలములయందుకూడను యోగిగానే వుంటుండాలి. భోగిగాగాని, రోగిగాగాని వుండరాదు. ప్రారంభంలో యిది సాధ్యము కాకపోయినప్పటికిని, క్రమక్రమేణా మనము పెంచుకొనుటకు తగిన ప్రయత్నము చెయ్యాలి. ఇది కష్టముతో కూడినదని నిరుత్సాహమునకు స్థానమివ్వరాదు. "సాధనమున పనులు సమకూరు ధరలోన". మనము సాధనచేస్తూ చేస్తూవుంటే తప్పక సాధించవచ్చు. కనుక, నిరాశకు స్థానమివ్వక ధైర్యసాహసములతో పవిత్రమైన ప్రేమతత్త్వమును సాధించాలి అనే దీక్షను పట్టిన వ్యక్తిత్వమే నిజమైన వ్యక్తిత్వము. నిజమైన భక్తి. దేహము నీటిబుడగ, మనసు పిచ్చికోతి. ఈ రెండింటిని మనము అనుసరించరాదు. మన హృదయాన్ని అనుసరించినప్పుడే నిజమైన దివ్యత్వమును చేరిపోతాము. ఎక్కడ చూచినా కాని చైతన్యము నిండివుంటున్నది. ఈ సర్వత్రా నిండిన చైతన్యమునుండియే మానవత్వమనేది సంప్రాప్తమవుతూ వచ్చింది. కనుకనే consciousness నుండి conscience, conscience నుండి conscious. conscious అనేది మన హృదయములో నిండి వుంటున్నాది. దీనినుండి మన హృదయములోపల ప్రసరిస్తూ వస్తున్నాది యీ conscious. కనుక conscience అనేది The one you think you are. Conscious అనేది The one others think you are. Consciousness అనేది The one you really are. ఈ నిజతత్త్వము మనము సాధించాలి. ఇట్టి సత్యస్వరూపాన్ని మనము దర్శించాలి. ఈ ప్రేమతత్త్వాన్ని మనము గ్రోలాలి. దీనితోనే మన జన్మము పూర్తిఅవుతుంది. ఇట్టి జన్మమే పరిపూర్ణమైన జన్మము. దీనికి ద్వేషమే లేదు. ఇట్టి ఆనందమయమైన,

sri sathyasai vachanamrutam

ప్రేమమయమైన, మధురమైన మానవత్వాన్ని ధరించికూడను మనము జీవితాన్ని వ్యర్థము చేస్తున్నాము. దివ్యమైన మానవ జన్మము సార్థకము గావించుకోటానికి తగిన ప్రయత్నము చేయాలని నేను ఆశిస్తూ, ఆశీర్వదిస్తూ, నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను.

**(తేదీ 19-1-1986న మద్రాసు నగరములో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam